క్లుప్తంగా

అదనపు ఎస్పీని కలిసిన మాలమహానాడు నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జిల్లా అడిషనల్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మేక నాగేశ్వర్‌రావును మాల మహానాడు గౌరవ అధ్యక్షుడు పెరుమాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాల మహానాడు ఐక్య వేదిక నాయకులు శనివారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు బొల్లెద్దు దశరథ, అశోద రవి, కట్ల మురళి, కంచి సరిత, గాజుల సైదమ్మ, నామ నాగయ్య, వేణు బలరాం, కళ్యాణ్, అనుముల పురి రఘు, కట్ల విజయ్, కట్ల శంకర్, చార్లీ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు ఇస్తున్న నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. యల్లయ్య, వి.సైదులు సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుండి పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, జిల్లా బాధ్యులు చంద్రారెడ్డి, పురుషోత్తం, మల్లారెడ్డి, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, రమేష్, చక్రధర్, సాయిలు, రవి, లింగారెడ్డి, శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

కళ్ల కలకపై అవగాహన

మద్దిరాల : ప్రస్తుతం విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్న కళ్ల కలకపై ప్రతి విద్యార్థి జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి కరుణసాగర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను పరీక్షించారు. అనంతరం కళ్ల కలకపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

అర్వపల్లి : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాల, ఆవాస గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్. పద్మ, యాకయ్య, గోపాలమిత్ర ఎస్.అర్జున్, అటెండర్ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

అభద్రతా భావంలో యువత

తుంగతుర్తి : సమాజంలో యువత పెడదారిన పడుతూ అభద్రతా భావంలో ఉంటుందని కాసా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో యువతకు అవగాహన కల్పించి మాట్లాడారు. యువత మత్తు పానీయాలకు బానిసై ఆర్థికంగా, మానసికంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉత్తమ నడవడిక అలవర్చుకొని, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాసా సభ్యులు అన్నెపర్తి నర్సయ్య, శ్రీనివాస్, భాగ్యమ్మ, వెంకన్న, మధుసూదన్, అరుణ, వరుణ్‌కుమార్, స్వరూప పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నాగారం : నాగారం మండల కేంద్రంలో గోడ కూలి మృతి చెందిన శీల రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, సీపీఎం ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పనులు ప్రారంభం



కోమటిపల్లిలో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి కొలతలు వేస్తున్న అధికారులు

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణం నిర్మాణానికి సంబంధించి కొలతలు వేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో క్రీడా ప్రాంగణాన్ని నిర్మిస్తున్నట్లు సర్పంచ్ జాల నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, ఈసీ నగేష్, పంచాయతీ కార్యదర్శి ఫర్హాన, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లు లేక ఇక్కట్లు!

- తరగతి గదులు, స్కూళ్ల ఆవరణల్లో లోపించిన పారిశుద్ధ్యం
- తప్పని పరిస్థితుల్లో పనులు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆత్మకూరు మండలంలోని ఓ పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని పాఠశాలల్లో స్కావెంజర్లు లేక పారిశుద్ధ్యం కొరవడుతోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ఆవరణ, తరగతి గదులను ఊడ్చడం తదితర పనుల కోసం గతంలో స్కావెంజర్లు పనిచేసేవారు. వీరికి నెలకు రెండు నుంచి మూడు వేల జీతం ఇస్తూ ప్రభుత్వం పని చేయించేది. కానీ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే వీరిని తొలగించారు. దీంతో పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. తరగతి గదులు, పాఠశాలల ఆవరణలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పుడప్పుడు ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాల ఆవరణం శుభ్రం చేసుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇక ఉపాధ్యాయుల గది ఉపాధ్యాయులే వంతుల వారీగా శుభ్రం చేసుకుంటున్నారు.

ఆత్మకూరు మండలంలో 58 పాఠశాలలు..

మండల వ్యాప్తంగా మొత్తం 58 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, ఆరు ప్రాథమికోన్నత, 40 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇటీవల కొన్ని పాఠశాలలను అనధికారికంగా మూసివేశారు. ఈ పాఠశాలల్లో సుమారుగా 3500 మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే స్కావెంజర్ల తొలగింపు అనంతరం గ్రామపంచాయతీల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులతో ఆయా పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. కానీ నెల రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ప్రస్తుతం మండలంలోని పాఠశాలల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలతో చిత్తడిగా మారి కొన్ని ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. దీన్ని భరించలేని ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందాలు పిల్లలతో కలిసి పాఠశాలల ఆవరణలను శుభ్రం చేసుకుంటున్నారు. ఇదే పరిస్థితి ఇంకా ఎన్నాళ్లు కొనసాగుందోనని ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు వచ్చి విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యార్థులు.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పారిశుద్ధ్య నివారణ చర్యల్లో పాల్గొనడం ప్రభుత్వానికి ఎంత మాత్రం మంచిది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్కావెంజర్లను నియమించి, పాఠశాలల నిర్వహణ బాగుండేలా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి నాయకులు కోరుతున్నారు.

స్కావెంజర్లను నియమించాలి



ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోవడం లేదు. విద్యార్థుల సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. చివరకు పాఠశాల్లో స్కావెంజర్లను నియమించకపోవడం సరైంది కాదు. పాఠశాలల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. విద్యార్థులు అంటువ్యాధుల బారిన పడే అవకాశముంది. వెంటనే స్కావెంజర్లను నియమించాలి.

– ఉత్తేజ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు

ఇబ్బంది అవుతోంది



పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరగతి గదులు, పాఠశాలల ఆవరణలు చెత్తాచెదారంతో అపరిశుభ్రం మారుతున్నాయి. ఫలితంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు పనులు చెప్పలేక.. మేం చేయలేకపోతున్నాం.

– రమేష్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు

శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ముఖ్యం



ఆత్మకూర్ (ఎస్) : ముక్కుడుదేవులపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని సర్పంచ్ ఇరుగు మనీషా అన్నారు. శనివారం మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి తల్లి తన బిడ్డకు క్రమం తప్పకుండా పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సల్వాది నిర్మల, ఆశా కార్యకర్త అనిత, అంగన్వాడీ టీచర్ మంగతాయమ్మ, సరస్వతి, గర్భిణులు, బాలింతలు ఎస్కే శిరీష, కత్తి లక్ష్మి, భయ్యా యశోద పాల్గొన్నారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీలోని ఆదర్శనగర్ 5వ అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మచ్చ శిరీష మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తప్పకుండా ముర్రు పాలు తాపించాలన్నారు. ముర్రు పాలల్లో అధిక పోషకాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, ఆశ కార్యకర్తలు విజయ, ఆయా రాములమ్మ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కొత్తగూడెం, తూర్పుగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమైనవని అన్నారు. ముర్రుపాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీబాయి, శారద, జ్యోతి, అంజలి, ఆశలు కొమరమ్మ, ఆయాలు పుష్ప, ఎలేంద్ర, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి : అవగాహన కల్పిస్తున్న టీచర్లు



తుంగతుర్తి : కొత్తగూడెంలో..

రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలి

దురాజ్‌పల్లి : రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని వేగవంతం చేసి గొర్రెల, మేకల పెంపకదారులను ఆదుకోవాలని తెలంగాణ గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి యాదవులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా గొర్రెలకు బదులు నగదు బదిలీ చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కడారి లింగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కంచు గట్ల శ్రీనివాస్, గోపనబోయిన రవి యాదవ్, బొల్లం సంజీవ యాదవ్, గురువయ్య పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాలు సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నాగారం : రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన వారి కోసం మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ నాయకులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ మాట్లాడారు. వర్షాలకు ఇళ్లు నేలమట్టం అయ్యాయని, ప్రాణ, ఆస్తినష్టం జరిగి అనేక మంది నిరాశ్రయులుగా మారారని అన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. కూలిపోయిన ఇళ్ల స్థానంలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి డి.యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



ఆత్మకూరులో సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

ఆత్మకూర్(ఎస్) : తమ సమస్యలు పరిష్కరించాలని మండల పరిధిలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. సమ్మెలో తన్నీరు వెంకన్న, బండారు సైదులు, ప్రసాద్, పవన్, పీటర్, శ్రీను, లింగా నాయక్, వెంకన్న, శేఖర్, నాగమ్మ, భిక్షం, రంగయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యక్షగానం ప్రదర్శించి నిరసన

అర్వపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం 31వ రోజు అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట యక్షగానం ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రణపంగ వెంకన్న, నకిరేకంటి నర్సయ్య, ఎల్లమ్మ, రమణయ్య, వెంకన్న, వెంకటమ్మ, దూదియా పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకుడు నకిరేకంటి శంభయ్య కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న 31వ రోజు సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గ్రామాల్లో పచ్చని వాతావరణమే ప్రభుత్వ లక్ష్యం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ఆకుపచ్చని వాతావరణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ఇమాంపేట గ్రామంలో అదనపు పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసేందుకు శనివారం స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాముల ఉపేందర్, ఏపీఓ వెంకన్న, ఈసీ రమేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

భానుపురి : ఎరుకల జాతిని గుర్తించి రాజకీయంగా ప్రోత్సహించిన సీఎం కేసీఆర్ ఒక్కరేనని తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ వీరన్న అన్నారు. కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం పట్టణంలోని ఎరుకల బజారులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దుర్గాప్రసాద్, దశరథ, కృష్ణ, సోములు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

నాగారం : రాహుల్‌గాంధీకి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు రావడం హర్షణీయమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై బీజే పీ నాయకులు కుట్రలు పన్ని కేసు నమోదు చేయించారని అన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న, ఈదుల రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 7న వరంగల్‌కు చెందిన మ్యాక్సివిజన్ లేజర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వర్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు హెల్త్‌కార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలి



అర్వపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ




తుంగతుర్తిలో..

అర్వపల్లి : చదువుల్లో వెనకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బి. బాలునాయక్ కోరారు. అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో రెండు మండలాల ఉపాధ్యాయులకు నిర్వహించిన గణిత శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారులు జెల్లా ప్రసాద్, వి. ప్రభాకర్, క్లాంపెక్స్ హెచ్‌ఎంలు కె. తబిత, డి. చాంప్లా, నారాయణ, వెంకన్న, డీఆర్పీ లక్ష్మణ్, ఎమ్మార్పీలు వి.సైదులు, సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.రమేష్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తుంగతుర్తి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గణితంపై నిర్వహించిన తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలతో పాటు, విద్యాప్రమాణాలు పెంపొందించడం కోసం అవలంబించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు తెలపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గురువయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం యాకయ్య, ఎమ్మార్పీ కాంతారెడ్డి, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న గంట నాగయ్య

తిరుమలగిరి : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంట నాగయ్య, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజారాం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాకలక్ష్మి, బీఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చామకూరి నర్సయ్య అన్నారు. శనివారం తిరుమలగిరిలో నిర్వహించిన కార్మిక సంఘాల తుంగతుర్తి ప్రాంతీయ రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న సూర్యాపేటలో, 10న హైదరాబాద్‌లో జరిగే మహా పడావ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు చట్టాలకు, జీఓలకు, చట్టబద్ధ హక్కులకు నోచుకోవడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు, సహాయ కార్యదర్శి దేశోజు మధు, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, జీడి కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు కోట రామస్వామి, పాల్వాయి పున్నయ్య, డీఎఫ్‌టీయూ నాయకులు రవి, కాసాని జనార్దన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు సామ పద్మారెడ్డి, మూరగుండ్ల మధు, రమేష్, రాంనర్సయ్య, ఖలింగం, ఉపేందర్, భిక్షం పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో పల్లెలు

చిలుకూరు : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పల్లెలు, తండాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు అంజియాదవ్ అన్నారు. 'మన ఊరు– మన గడపకు మన అంజన్న' కార్యక్రమంలో భాగంగా శనివారం జానసగర్, సీత్లా తండా, దూదియాతండా, నారాయణపురం, సీతారాంపురం, చిలుకూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు మద్యం దుకాణాల మీద ఉన్న ప్రేమ ప్రజల మీద లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను మరిచిందని ఆరోపించారు. గ్రామాల్లో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయకుండానే తిరిగి మరోసారి అధికారంలోకి రావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌నాయుడు, దేశినేని మట్టయ్యయాదవ్, రవి, కోటయ్య, రాముడు, శివ, తోట కమలాకర్, వెంకటేష్, బాబు, నవీన్, వెంకన్న, చంద్రకళ, గౌతమి, బాలు, అయ్యప్ప, అప్పారావు, సైదులు, రాజ, సాయి, సంతోష్, గోపి, చిన్నా పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మద్దిరాల : మండలంలోని ప్రతి పోలింగ్ బూత్‌లో సమస్యలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్ననెమిల గ్రామంలోని పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పోలింగ్ బూత్‌లలో కరెంట్, ఫ్యాన్లు, తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీంచారు. అదే విధంగా చిన్ననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన దివ్యాంగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ప్రధానోపాధ్యాయుడు శివయ్య, సర్పంచ్ సూరారపు గౌతమిరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి : ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో నాలుగు అసెంబ్లీ స్థానాలను బీసీలకు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలగిరి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొత్తగట్టు మల్లయ్య, అంబటి మహేష్, వంగరి బ్రహ్మం, కాసాని శ్యాం, కడెం మల్లయ్య, గాదరబోయిన లింగయ్య, ప్రకాష్, చారి, రామ్మూర్తి, సోమరాజు, వంగరి సోమకృష్ణ, ఉపేందర్ గౌడ్, గణేష్, మహేష్, పులిగిల్ల యాదగిరి, సుంకరి కిరణ్, గూడూరి శ్రీనివాస్, కోట రాములు, శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్లు



సూర్యాపేటలో యూత్ డిక్లరేషన్‌ను వివరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సూర్యాపేట నియోజకవర్గంలోని పేదలందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 29వ వార్డులో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిధులు, నియామకాలు నీరుగారిపోయాయని తెలిపారు. రుణమాఫీ పేరుతో ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెర లేపిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4వేల పెన్షన్, రూ.500లకే వంటగ్యాస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షఫీఉల్లా, పెద్దిరెడ్డి రాజా, శనగాని రాంబాబు, ఫరూక్, స్వామినాయుడు, నేరేళ్ల మధు, వల్దాసు దేవేందర్, గోపగాని గిరి, బైరు మహేష్, కుంచం రమేష్, శ్రీమాన్, పాలగాని కృష్ణ పాల్గొన్నారు.

మన ఊరు–మనబడి పనుల పరిశీలన



పాట్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి



పర్సాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

పెన్‌పహాడ్ : పొట్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల, అన్నారం ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పనులను శనివారం మండల ప్రత్యేక అధికారి రాంపతి పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుకదేవి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక పరిశీలన

అర్వపల్లి : అర్వపల్లి, పర్సాయపల్లి, సీతారాంపురం తదితర గ్రామాల్లో శనివారం ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, ఆర్ఐ కరుణాకర్, టీచర్లు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

మద్దిరాల : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తాయని జెడ్పీటీసీ కన్నా సురాంభ వీరన్నగౌడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ముకుందాపురంలోని వనపర్తి రవి వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి స్రవంతి, పంచాయతీ కార్యదర్శి ఉమ, యాదగిరి, హరీష్, శశికుమార్, రవికుమార్, భద్రాచలం, అనిల్, జగదీష్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

నూతనకల్ : ప్రజా సమస్యలను పరిష్కరించే అధికారులకు ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్‌కు శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ ఇందిర, సర్పంచ్ చూడి లింగారెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి

తుంగతుర్తి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే.ఉమార్ అన్నారు. మండల పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మంజుల తన సొంత ఖర్చులతో శనివారం ఆ పాఠశాల విద్యార్థులకు స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, ఫజల్, ఎం.రాజు, బి. మంగు, లింగయ్య, గౌస్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



గొట్టిపర్తిలో విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు